# డిటెక్టివ్ సుందరం

"బాబు"



పరీక్షలు జరుగుతున్నాయి. తెల్లవారితే హిస్టరీ పరీక్ష. అప్పటికే 11 గంటలు దాటింది. ఆ రోజు సోమవారం స్వర్గీయ శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారి సూక్తి ప్రకారం ఒక పూట భోజనం మనేవారిలో నేనూ ఒకణ్ణి అలా చేసినందువలన ఆకలివేస్తూంది. అదీకాక పరీక్షలనేసరికి, నిద్రాదేవత నిన్నే వరిస్తానంటూ వస్తూంది అప్పటికే యుద్ధాలూ . రాజ్యాలుతో బుర్ర వేడెక్కిపోయింది

నా రూమ్‌మేట్ మోహనరావుకు కెమెస్ట్రీ ఎగ్జామినేషన్ వుందిట కెమెస్ట్రీ ఈక్వేషన్స్‌తో వాడు కుస్తీ పడుతున్నాడు. వాడి గొడవతో నిద్రయితే పోయిందిగాని. ఆకలివేస్తూంది. చిన్నగా రూమ్ నుండి బయలుదేరి రోడ్డుమీద నడుస్తున్నాను ఒంటరిగా ! అర్ధరాత్రివేళ ఒక్క హోటల్‌లన్నీ అన్నీ నిద్రిస్తుంటాయి. దానిలోకి నడిచి. నిండుగా టిఫిన్ తిని ఒకరకమైన స్ప్రింగ్ టీ తాగి తోటా వెలిగించుకొని పొగవదులుతూ నడుస్తున్నాను.

నా ఆలోచనలు పరిపరి విధాలుగా పయనిస్తున్నాయి నా జీవితాశయ మల్లా ఒక్కటే దొంగలను పట్టుకొనటం, వారిని శిక్షించటం ప్రభుత్వానికేకాక భారతమాతకు సేవ చేయాలనే ఆకాంక్ష ఎక్కువగా వుంది.

మొన్నీమధ్య మోహనరావు క్రొత్తగా సైకిల్ తెచ్చుకొన్నాడు. అది ఎవరిచ్చారనుకొన్నారు - వాడి మామగారు కట్నంగా.... కాదు . కాదు... యిష్టంగా యిచ్చారు. (వాడు కట్నంగా అని చెప్పక ప్రేమతో యిచ్చాడని డబ్బా కొట్టాడు.) ఓరోజు వాడు ఆ వాహనాన్ని కాలేజీ సైకిల్ స్టాండులో ఉంచి ఆఫీసులో ఫీజు 'పే' చేయాల్సి వుండటం మూలంగా, తొందరగా 'లాక్' చేయకుండా వెళ్ళాడు. పని ముగించుకొని, తిరిగి వచ్చేసరికి సైకిల్ లేదు ఆ విషయం నాతో చెప్పి భోరుమన్నాడు రూములో.

నేను వాడి సైకిల్‌కొరకు ఎంతగానో పరిశోధనలు జరిపాను పెద్ద డిటెక్టివ్‌లా కాలేజీకి నామం పెట్టి కొన్నిరోజులు ఆ సైకిల్‌కొరకు బస్‌స్టాండ్స్, సైకిల్‌స్టాండ్స్, రైల్వేస్టేషన్ వగైరా చోట్లన్నీ వెదికాను. (వాడి సైకిల్ మాదిరిగా వున్న ఓ సైకిల్ పట్టుకొని పోలీసు రిపోర్టు యిస్తానని బెదిరించాను. వారు నన్ను తన్నబోగా. బ్రతిమిలాడి భంగపడి, మెల్లగా జారుకొన్నాను ) ఎలాగైతేనేమి ఓ నాలుగు రోజుల శ్రమానంతరం సైకిల్‌ను పట్టుకొని, సైకిల్‌దొంగ శంకరాన్ని పోలీస్ స్టేషన్‌లోనూ, సైకిల్‌ను మోహనరావుకు అప్పగించి నా ప్రతిభ తెలియజేశాను.

నేను చేసిన ఈ సేవకు మెచ్చి కాలేజీ కుర్రాళ్ళంతా (నా స్నేహితులు) డిటెక్టివ్ సుందరం' అనే బిరుదును నా పేరుప్రక్కగా చేర్చారు (ఇదంతా నా ఖర్చుతోనే) చిన్న (పెద్ద) డిన్నర్ పార్టీతో నాటి సభ ముగిసింద

అదే నా తొలి ప్రయత్నం. దానిలో విజయం సాధించాను. నేనే పెద్ద డిటెక్టివ్ అయినంతగా ఫీలయ్యాను. అప్పటినుండి చిన్నచిన్న విషయాలను సీరియస్‌గా పరిశీలించటం పరిపాటయిపోయింది. అప్పటినుండి ఎందరో మిత్రులు నా సలహాలకొరకొచ్చేవారు...ఉచిత సలహాల నందించి వారికి సాయపడేవాడిని (గర్వంగా).

ఆ మధ్య నాకో 'లవ్‌లెటర్' వచ్చింది. నేను ఆశ్చర్యపోయాను. నాకు ప్రేమలేఖ ఎవరు వ్రాశారా అని. (వ్రాయకూడదనికాదు. డిటెక్టివ్‌ని కదండి) ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా పరిశీలించాలి. లవ్‌లెటర్ వ్రాసిన మాధవి వెంటపడి, పోజులు వేయగా, చెప్పుదెబ్బలు తినకుండా, చావుతప్పి కన్నులొట్టపడిపోయినట్లుగా, రూమ్‌కుచేరి డిటెక్షన్ చేసి, దానిని వ్రాసింది మా ఫ్రెండ్సేఅని, నన్ను ఫూల్‌ను చేసేందుకలా వ్రాశారని తెల్సినప్పుడు ఏడవలేక నవ్వాను. కాదుకాదు.నవ్వలేక ఏడ్చాను.

నేను ఇలానే ఆలోచిస్తూ, నిర్మానుష్యంగా పాడుబడిన 'ఆంధ్ర మహిళా సరోజినీనాయుడు పార్కు" ప్రక్క రోడ్డుకు తిరిగాను. దారినపోతూ పార్కులోకి చూచాను. అది పాడుబడింది. కొన్ని సిమెంటు బల్లలు మాత్రం వున్నాయి. దానిలో అంతా బికారీలు అడుక్కునేవారు, పడుకుని వున్నారు ఇలా నడుస్తున్న నేను ఒక దృశ్యం చూచి ఆగిపోయాను.

ఎవరో బాటసారై యుంటాడు, తలక్రింద సంచి పెట్టుకొని యున్నాడు. ప్రక్కనే పడుకుని యున్న వ్యక్తి అతని చెంతచేరి. జేబులు తడుముతున్నాడు. వెంటనే నాకో ఆలోచన మనస్సులో మెదిలింది. ప్రభుత్వానికి మరోమారు సహాయం చేసి, వారిచే మెప్పు పొందాలని ఆలోచించి, మెల్లగా లోపలికి ప్రవేశించాను.

నేనిలా గోడదూకి రావడం గమనించిన ఆ వ్యక్తి మెల్లగా నా వైపు రాసాగాడు. నా గుండె అతి వేగంగా కొట్టుకొంది. (భయంకూడ వేసింది) నన్నేమీ మాట్లాడనీయకుండా, ఆ వ్యక్తి నాపై కలియబడ్డాడు. ఇరువురం కొద్దిసేపు పెనుగులాడాము. ఇంతవరకూ తలక్రింద సంచీ పెట్టుకుని పడుకొనియున్నవ్యక్తి లేచి మా వైపు రాసాగాడు. నాకు సహాయపడతాడని ఎంతగానో ఆనందించాను. ఇంతలో ఆ దొంగ నన్ను గట్టిగా పట్టుకొన్నాడు. ఆ దగ్గరకు వచ్చేవ్యక్తి నన్ను రక్షించకపోతాడా అని ఆశగా అతనివైపు చూచాను. ఆ వ్యక్తి నాకు దగ్గరగా వచ్చాడు.

నాకు దగ్గరగా వచ్చినవ్యక్తి నా ముక్కు దగ్గరగా ఒక గుడ్డను కొంచెం సేపుంచాడు. తీయటి వాసన వేసింది. నాకు గుడ్డను వాసనచూపించిన వ్యక్తివైపు చూచాను. హోటల్‌లో బిల్ పే చేస్తున్నప్పుడుప్రక్కనే వున్నవ్యక్తిఅతను. నాకు మైకం క్రమ్మినట్లయింది. తెలివి తప్పుతున్న సమయంలో నా జేబులోని ఆరోజే ఇంటినుండి వచ్చిన రెండు వందల రూపాయలు ఆ వ్యక్తులు తస్కరించటం మాత్రం లీలగా గుర్తుంది.

★